# కిక్

ఆపాలని ఎంత ప్రయత్నం చేసినా సన్నగశయనరావుకి సంతోషం వరదగోదారిలా పొంగుకొచ్చింది. అప్పటికే ఒకరిద్దరు గుమస్తాలు అతని వదనంలో తాండవిస్తున్న ఆనందాన్ని పసిగట్టినట్టు అతడిని అసహనంగా చూశారు. ఒక వృద్ధ గుమస్తా నోరంతా తెరచి "ఏమిటోయ్ కథ.... లాట్రీ గాని తగిలిందా?" అనడిగేశాడు.

జవాబు చెప్పకుండా నోరు నొక్కేసుకున్నాడు సన్నగశయనరావు. ఏమని చెబుతాడు? చెబితే బావుంటుందా? ముందు ఓ రెండు మూడొందలు అప్పడుగుతాడు. అసలే ఆయన పేరు అప్పుల అప్పారావు కూడా.

అతని సెక్షన్‌లో చాలాపనుంది. కానీ చెయ్యబుద్ధికాలేదు. మనసంతా గాల్లో తేలిపోతున్నట్టు వుంది. తన నలభైయేళ్లలో ఇంతవరకు ఎప్పుడూ ఇలా జరగలేదు. తను తన తోడి గుమస్తా గుర్నాథం మాట విని వుంటే తనకీ అదృష్టం కలిగేదేనా అనుకున్నాడు.

గుర్నాథం ఆ మధ్యాహ్నం తనతో కలిసి క్యాంటీన్లో భోజనం చెయ్యమన్నాడు. కానీ తను విన్లేదు. తన మనసంతా ఇంట్లో భార్య చేసిన వంకాయ కూరమీద వుంది.

ఆ రోజు ఆఫీసుకు బయల్దేరుతున్నప్పుడు భార్య చెప్పింది. గుత్తివంకాయ కూర వండుతున్నట్టు. అందుకే ఇల్లు దూరమయినా కొంచెం రిస్కు తీసుకుని బస్సులో భోజనానికి వెళ్లి వచ్చాడు.

అలా వెళ్లి వస్తున్నప్పుడే అదృష్టం తనకు డేమ్ ఇచ్చింది.

ఒకటా! రెండా! కాదు. అక్షరాలా ఎనిమిది వందలు.

బస్సు దిగబోతూ కిందికి చూస్తే కాళ్లదగ్గర పడివుంది. పర్సు నవ్వుతూ అందుకోనున్నట్టుగా. చటుక్కున తీసుకుని ఎటూ చూడకుండా జేబులో పెట్టుకున్నాడు.

ఎవరిదో? తన పక్కన కూర్చున్నవాడెవడో ముందు స్టేజిలో దిగిపోయాడు. ఆ తర్వాత ఎవ్వరూ తన పక్కన కూర్చోలేదు. బస్సు దిగి ఆఫీసుకు నడుస్తూ మధ్యలో పర్సు బయటికి తీసి డబ్బు తెక్కవేసినప్పుడు గుండె లయ తప్పుతున్నట్టు అనిపించింది.

సరిగ్గా ఎనిమిదివందల రూపాయలు. జీవితంలో అంత పెద్ద మొత్తము సన్నగశయనరావుకు డబ్బు ఎప్పుడూ అలా దొరకలేదు. చిన్నతనంలో రోడ్డుమీద అప్పుడప్పుడు కొన్ని చిల్లరనాణేలు మాత్రమే దొరికాయి.

చాలా ఎక్కువ మొత్తంలో ఒకసారి సినిమాల్లో ఐదురూపాయల నోటు దొరికింది. అంతే. ఓ ఫైలు తెరిచాడు సన్నగశయనరావు. కాని అందులో అతనికి ఏమీ కనిపించలేదు. దాన్ని మూశాడు. మరో ఫైలు తెరిచినా అందులోనూ అతనికి శూన్యం కనిపించింది. ఫైళ్లను తీసి ఓ పక్కన పెట్టి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

అప్పుడు వృద్ధ గుమాస్తా ఐన అప్పుల అప్పారావు వచ్చి "ఓ యాభై వుంటే సర్దుతావా? నాలుగు నెలల్లో తిరిగి సర్దుతాను" అన్నాడు చేత్తో గడ్డం నిమురుకుంటూ.

సన్నగశయనరావు చిన్నగా నవ్వి "ఇంకా నయం రిటైరయినాకే ఇస్తాననలేదు" అన్నాడు. "జోక్ కాదు సన్నగశయనరావు.... మా అమ్మాయి పురిటికి వచ్చింది. సాయంత్రం ఇంటికి వెళుతూ ఫెయిర్ అండ్ లవ్‌లీ క్రీమ్ కొనుక్కుని వెళ్లాలి. పొద్దున ఆఫీసుకు వస్తున్నప్పుడు చెప్పింది" అన్నాడాయన.

"సారీ.... నా దగ్గర లేవు.... ఇంకెక్కడయినా ట్రయ్ చెయ్యి" అన్నాడు సన్నగశయనరావు.

ఆయన ఏడుపు మొహంతో వెళ్లిపోయాడు.

అప్పుడు సన్నగశయనరావు ఆఫీసులోనించి బయటకు వచ్చాడు. కొంచెం దూరంలో వున్న టెలిఫోన్ బూత్‌లోకి వెళ్లి తన మిత్రుడు అహోబలానికి ఫోన్ చేశాడు.

"అవున్రా.... నేనే.... సన్నగాన్ని మాట్లాడుతున్నాను. రాత్రి ఏడున్నరకు నువ్వు ఇంటిదగ్గరే వుండు.... మంచి మందుపార్టీ వుంది. రిలాక్స్‌కు వెళదాం"

"ఎవరిస్తున్నారు?" అవతల్నించి అడిగాడు అహోబలం.

"నేనేరా బాబూ...."

"ఏమిటీ విషయం? ఏదయినా అకేషన్ వుందా?"

"అవన్నీ ఇప్పుడెందుకు? ఏడున్నరకు ఇంట్లో వుండి" అని ఫోన్ పెట్టేశడు సన్నగశయనరావు.

ఓ నిముషానికి మళ్ళీ మరో మిత్రుడు సుందరానికి ఫోన్ చేసి రాత్రి పావుతక్కువ ఎనిమిదింటికి రిలాక్స్ బార్ అండ్ రెస్టారెంటు దగ్గరకు రమ్మని

చెప్పాడు.

మళ్ళీ ఆఫీసుకు వచ్చి తన సీట్లో కూర్చున్న సన్నగశయనరావుకు తృప్తిగా వున్నట్లనిపించింది. తనకు ఆయాచితంగా దొరికిన డబ్బును సద్వినియోగపరచబోతున్నాడు. అవును. మందు తాగి చాలా రోజులయ్యింది. దాదాపు నెలరోజులు కావస్తోంది.

ఈరోజు మందు తాగి ఆకాశం అంచుల వరకూ వెళ్లాలనుకున్నాడతను. అలా అనుకుని ఓ ముఖ్యమైన ఫైలును తీసి రాయటం మొదలుపెట్టాడు. ఓ ఐదు నిముషాలు అవగానే మళ్లీ అతని దగ్గరకు అప్పుల అప్పారావుగా పిలవబడే నాంచారయ్య అనే ఆయన వచ్చి.... "మొత్తంమీద పని సగమయ్యింది" అన్నాడు.

''సగమంటే పాతికరూపాయలు దొరికాయా'' అని అడిగాడు సన్నగశయనరావు.

"కాదు.... మన టైపిస్టు సుశీలను డబ్బు అడిగాను. ఎందుకన్నది. ఫెయిర్ అండ్ లవ్లీ కొనాలని చెప్పాను. వెంటనే హ్యాండ్‌బ్యాగ్‌లో నించి తను సగం వాడుకున్న ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమ్ ట్యూబు తీసి ఇచ్చింది. డబ్బుల్లేవట. జీతం రాగానే ఇరవై రూపాయలివ్వమంది"

పెద్దగా నవ్వాడు సన్నగశయనరావు.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అడిగాడు నాంచారయ్య.

"ఏం లేదులే.... సుశీల త్యాగానికి నవ్వొచ్చింది"

నాంచారయ్య కూడా నవ్వుకుంటూ వెళ్లాడు.

ఫైలు రాస్తున్నా సన్నగశయనరావు ఆలోచనలన్నీ ఇంకొన్ని గంటల్లో తను పొందబోయే ఎంజాయ్‌మెంటు మీదనే వున్నాయి. ఇంతకీ తను నిద్రలేవగానే ఎవరి మొహం చూశాడు? అనుకున్నాడు. ఇంకెవరు? తన భార్య వందన మొహమే చూశాడు. నవ్వుతూ తనని నిద్రలేపింది. పోనీ.... ఆ దొరికిన డబ్బుతో వందనకు ఓ మంచి చీర కొనిపెడితే? ఎలా వుంటుందనుకున్నాడు.

ఉహు.... కుదర్దు.... స్నేహితులకు ఫోన్ చేసి తను కమిటయిపోయాడు. అదృష్టం బావుండీ మళ్ళీ ఎక్కడైనా ఓ వెయ్యి రూపాయలు దొరికితే అప్పుడు వందనకు చీర కొనాలి. ఇప్పుడు మందుపార్టీ తప్పదు.

తల్చుకుంటే అతని నోట్లో మందునీళ్లూరాయి.

గుటకలు మింగాడు. ఆలోచనల్లో వుండగానే కాలం పరుగుదీసింది. ఆరు గంటలు కావస్తున్నప్పుడే ఆఫీసులో ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. కానీ సుశీల టైప్ చేస్తున్న చప్పుడు మాత్రం వినపడుతూనే వుంది.

అప్పటికి ఏడు గంటలు కావస్తోంది. సన్నగశయనరావు నాలుగు ముఖ్యమైన ఫైళ్లను ఎటెండయి వాటిని అటెండరుచేత ఆఫీసరు గదిలోకి పంపించాడు. ఇక సీట్లోంచి లేచే ప్రయత్నంలో వుండగా సుశీల వచ్చి....

"రేపు సెలవు పెడుతున్నాను. అందుకే పెండింగ్ లేకుండా చేసుకున్నాను" అన్నది చిన్నగా నవ్వి.

"అలాగా" అన్నాడు సన్నగశయనరావు.

"మీరో సహాయం చెయ్యగలరా?" అన్నది సుశీల.

"ఏమిటి? అనడిగాడతను.

"రేపు ఊరెళుతున్నాను. ఓ రెండొందలు ఇవ్వండి. జీతం రాగానే ఇస్తాను" అన్నది.

ఆలోచన్లో పడ్డాడు అతను. సుశీల ఎంతో అవసరమయితేగానీ డబ్బులు అడగదు. ప్రస్తుతానికి తన దగ్గర వున్నాయికదా ఇద్దామా అనుకున్నాడు. కానీ తాము పొందబోయే సుఖం రెండొందల మేరకు తగ్గుతుందని గుర్తుకువచ్చి "సారీ.... నా దగ్గర లేవు" అన్నాడు.

మారు మాట్లాడకుండా సుశీల బయటికి వెళ్ళిపోయింది. సన్నగశయనరావు కూడా ఆఫీసు నుంచి బయటికి రిక్షా మాట్లాడుకుని అహెూబలం ఇంటికి వెళ్ళాడు.

అప్పటికే అహెూబలం మిత్రుడికోసం ఎదురుచూస్తూ కాలుగాలిన పిల్లిలా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నారు. ఇద్దరూ కలిసి నడుచుకుంటూ రిలాక్స్ బార్ అండ్ రెస్టారెంటు దగ్గరకు వచ్చేసరికి సుఇుదరం అక్కడే చెట్టు కింద నిలబడి వున్నాడు.

వాళ్ళను చూసి "ఇంత ఆలస్యమయ్యిందేం?" అన్నాడు.

"ఆలస్యమా? నీకు చెప్పిన టైముకంటే పది నిముషాలు ముందుగా వచ్చాం" అన్నాడు సన్నగశయనరావు.

"సర్లే.... ముందు లోపలకు పదండి. ఆలస్యమైతే ఖాళీ వుండదు" అని తొందరచేశాడు సుందరం. ముగ్గురూ గబగబా లోపలకు వెళ్ళారు.

అప్పటికే బార్ అంతా మందుబాబులతో నిండిపోయివుంది. వీళ్ళ అదృష్టంకొద్దీ ఒక్క టేబుల్ ఖాళీగా వుంది. అక్కడ వున్న నాలుగు కుర్చీల్లో ఒక్క మనిషి కూర్చుని నింపాదిగా బీరు తాగుతున్నాడు.

ముగ్గురూ కూర్చున్నారు. బేరర్ రాగానే సన్నగశయనరావు "ఎవరికి ఏం కావాలో చెప్పండి" అన్నాడు.

సుందరం బీర్ చెప్పాడు. దానితోపాటు చికెన్ ఫ్రైయ్ కావాలన్నాడు. అహోబలం ఇంపీరియల్ బ్లూ విస్కీ కేజూనట్స్ ఆర్డరిచ్చాడు. సన్నగశయనరావు మేన్షన్ హౌస్ బ్రాందీ, గ్రీన్‌పీస్ మసాలా తీసుకురమ్మన్నాడు.

"ఇప్పుడు చెప్పరా బాబూ ఇంతకీ ఈ పార్టీకథేమిటో" అనడిగాడు అహోబలం బేరర్ వెళ్ళిపోగానే.

"కొంచెం ఓపిక పట్టండి. ముందు మందు రాగానే దాన్ని మింగి చెబుతాను.... సరేనా" అన్నాడు సన్నగశయనరావు. వాళ్ళు తన వూపారు.

కొంచెంసేపటికి వాళ్ళు ఆర్డరిచ్చినవన్నీ వచ్చాయి.

బేరర్‌కు చెప్పి రెండు సోడా సీసాలు కూడా తెప్పించాడు అహోబలం. సీసాలు తెరుచుకున్నాయి. మందు గ్లాసుల్లోకి దూకింది. సోడాలో కలిసిపోయింది.

ముగ్గురూ చీర్స్ కొట్టారు. మందు మింగారు.

ముగ్గురూ గ్లాసులు బల్లమీద వుంచారు.

"ఎన్నాళ్ళయింది మనం కలుసుకుని ఈ బార్లో" అన్నాడు సుందరం చికెన్ ఫ్రైయ్ తింటూ.

"నెల" అన్నాడు అహోబలం. సిగరెట్టు ముట్టిస్తూ.

"ఏమయినా మందు రేట్లు బాగా పెరిగిన తర్వాత మన డబ్బులతో తాగాలంటే చాలా బాధగా వుంటోందిరా" అన్నాడు సన్నగశయనరావు.

"ఇంతకీ మాకు ఈ పార్టీ కథ చెప్పనేలేదు" అన్నాడు సుందరం మళ్ళీ బీరు ఓ గుటకేసి.

"చెప్పు.... సస్పెన్స్‌లో పెట్టక" అన్నాడు అహోబలం.

సన్నగశయనరావు మేన్షన్ హౌస్ బ్రాందీలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ తను మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్ళి బస్సులో తిరిగివస్తున్నప్పుడు తన కాళ్ళ దగ్గర ఆ పర్సు దొరికినట్టూ, అందులో ఎనిమిదివందలు వున్నట్టూ చెప్పాడు.

పర్సు దొరికినందుకు మిత్రులు సన్నగశయనరావుకు అభినందనలు తెలియజేశారు.

అహోబలం ఏదో గుర్తుకువచ్చినట్టు "ఏదో కథలోలాగా అవుతుందేమో ఇది కూడా" అన్నాడు.

"కథేమిటి?" అనడిగాడు సుందరం.

"ఆ డబ్బులు మనవాడు కొడుక్కి ఏ కాలేజీ ఫీజు కట్టటానికో ఇచ్చాడేమో" అన్నాడు అహోబలం.

సన్నగశయనరావు కూడా చిన్నగా నవ్వి "అట్లాంటి ట్విస్ట్ లేదురా.... నేనెవడికీ డబ్బులివ్వలేదు" అన్నాడు మందు మింగి, గ్రీన్‌పీస్ తినబోతూ.

బార్‌లో సన్నగా మ్యూజిక్ వినపడుతోంది. కైపు తలకెక్కినవాళ్ళు తూలుకుంటూ వెళుతున్నారు. కొత్తవాళ్ళు వస్తున్నారు. సుందరం మూడు బీర్లు తాగాడు. రెండు ప్లేట్లు చికెన్ ఫ్రైయ్ తిన్నాడు. ముగ్గురూ బాగానే తాగారు.

మత్తు ముగ్గురికీ బాగానే తలకెక్కింది.

బిల్లు చెల్లించాడు సన్నగశయనరావు. ఏడువందల నలభై అయ్యింది. బేరర్‌కి టిప్‌కింద ఇరవై రూపాయలిచ్చాడు.... మిగిలిన డబ్బులతో సిగరెట్లు కొన్నాడు.

తూలుతున్నారు. బార్‌లోనించి బైటకు వస్తూ అహోబలం అన్నాడు "ఒరేయ్ సన్నగశయనం.... బేవార్స్‌గా వచ్చిన డబ్బులతో మనం మందుకొట్టి మజా చేసుకున్నాం. పాపం.... పోగొట్టుకున్నవాడు ఆ బాధ భరించలేక అప్పుచేసి మరీ ఇక్కడే మందు కొడుతున్నాడేమో"

వాళ్ళిద్దరూ నవ్వారు. బయటకు వచ్చి ముగ్గురూ మూడు రిక్షాలెక్కి ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరారు.

❖ ❖ ❖

ఉదయం ఏడుగంటటు దాటుతున్నప్పుడు అతనికోసం ఎవరో వచ్చారని సన్నగశయనరావుని నిద్రలేపింది అతని భార్య వందన.

బలవంతంగా లేచాడతను. ఇంకా బాగా మత్తుగా వుంది. ఆ మత్తులోనే నడిచి ముందుగదిలోకి వచ్చాడు. అక్కడ కుర్చీల్లో ఇద్దరు మనుషులు కూర్చున్నారు.

సన్నగశయనరావును చూడటంతోనే ఒకతను–

"నిన్న మధ్యాహ్నం బస్సులో వస్తుంటే నా పక్కన కూర్చున్నది ఈయనే అన్నయ్యా" అన్నాడు.

"ఏమిటీ విషయం?" అన్నాడు సన్నగశయనరావు.

"నా పేరు జాకబ్. ఐ.డి. పార్టీ కానిస్టేబుల్ని. వీడు నా తమ్ముడు జాన్సన్. నిన్న మధ్యాహ్నం బస్సులో వీడి పర్సు ఎవరో కొట్టేశారు. ఎంక్వయిరీ చేస్తే బస్సులో వీడి పక్కన మీరు కూర్చున్నారని తెలిసింది. కేసు పెడదామనుకుని ఒకసారి మీకు చెప్పాలని వచ్చాం" అన్నాడు.

సన్నగశయనరావుకు తలకెక్కిన మత్తంతా ఒక్కసారి దిగిపోయినట్టుగా అనిపించింది. ఇంకెవరయినా ఐతే తనకేమీ తెలియదని బుకాయించేవారే.... కానీ వచ్చింది పోలీసు మనిషి.... అందుకే "పర్సు నాకు దొరికింది. దానిని నేను కొట్టెయ్యలేదు. అందులో ఎనిమిదివందలున్నాయి. ఇచ్చేస్తాను. కేసు పెట్టొద్దు" అన్నాడు.

"ఎనిమిదివందలు కాదు. అందులో వుండాల్సింది వెయ్యి రూపాయలు" అన్నాడు జాకబ్.

"కాదు.... ఎనిమిదివందలే వున్నాయి. ఒట్టు"

"వెయ్యికి రూపాయి తగ్గినా తీసుకోను.... ఇవ్వలేకపోతే చెప్పండి కేసు పెడతాను" అన్నాడు జాకబ్.

"వద్దు.... ఇస్తాను" లోపలకు వెళ్ళి వెయ్యి దొరికిన పర్సూ తీసుకువచ్చి జాకబ్‌కు ఇచ్చాడు ఏడుస్తూ.

థాంక్స్ చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు. కాని.... రాత్రంతా రిలాక్స్ బార్‌లో తన పర్సు దొరకటం గురించి వివరంగా స్నేహితులకు చెప్పేటప్పుడు ఆ జాకబ్ పక్క టెబిల్ దగ్గర వున్నాడని అతనికెలా తెలుస్తుంది? ❖

*స్వాతి వారపత్రిక, 28-9-2001*